క్లుప్తంగా

నిరుపేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్‌



అడ్డాకుల: అత్యవసర సమయంలో వైద్యం చేయించుకునే నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్‌ అండగా నిలుస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్యసాగర్‌ అన్నారు. మూసాపేట మండలం పోల్కంపల్లికి చెందిన లక్ష్మమ్మకు సీఎంఆర్‌ఎఫ్‌ ద్వారా రూ.40వేలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కును మంగళవారం బాధితురాలి ఇంటికి వెళ్లి అందజేశారు. నిరుపేదలు వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్‌ఎఫ్‌ను వినియోగించుకోవాలని జెడ్పీటీసీ సూచించారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహ, నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మధు, నర్సిములుగౌడ్‌ తదితరులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



మిడ్జిల్: మండలంలో 10 మంది లబ్ధిదారులకు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను ఎంపీపీ సుదర్శన్‌, జెడ్పీటీసీ శశిరేఖ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలకు అండగా నిలుస్తుందని అన్నారు. ఆడపిల్లల తల్లిదండ్రులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీటీ మాధవి, ఆర్‌ఐ రామాంజనేయులు, ఎంపీటీసీ యశోద, శ్రీనివాస్‌గౌడ్‌, భద్రయ్య, గోపాల్‌, జగన్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్‌పై విచారణ

గండేడ్: మండలంలోని సల్కర్‌పేట్‌ డిప్యూటీ సర్పంచ్‌పై గతంలో వార్డు సభ్యులు అవిశ్వాస తీర్మానం చేసి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఉపసర్పంచ్‌కు నోటీసులు జారీ చేశారు. తనకు సరైన సమయంలో నోటీసులు అందలేదని ఉపసర్పంచ్‌ తెలిపారు. దీంతో మంగళవారం ఆర్డీఓ అనిల్‌కుమార్‌, డీఎల్‌పీఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. అనంతరం నివేదికను కలెక్టర్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా శ్రీశైలం

బాలానగర్: బీజేపీ మండల అధ్యక్షుడిగా మండలంలోని హేమాజిపూర్‌కు చెందిన మండల ప్రధాన కార్యదర్శిగా సేవలందించిన పానుగంటి శ్రీశైలం నియమితులయ్యారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు.

పంటనష్టం వివరాల సేకరణ

జడ్చర్ల: మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను అంచనా వేసినట్లు మండల వ్యవసాయాధికారి గోపినాథ్‌ తెలిపారు. మండలంలోని చిన్న ఆదిరాలలో మంగళవారం వర్షాల కారణంగా మొలకెత్తిన వేరుశనగ పంట వివరాలను సేకరించామన్నారు. ఈ మేరకు గ్రామాల వారీగా పంట నష్టాన్ని అంచనా వేసి పూర్తి స్థాయి నివేదికలను జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

మత్స్య సంఘం ఎన్నిక

బాలానగర్: మండలంలోని వీరన్నపల్లిలో మత్స్య సంఘాన్ని ఎన్నుకున్నట్లు సర్పంచ్‌ పట్నం రాజు తెలిపారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామంలో మత్స్య సంఘం ఏర్పాటు అయ్యిందని, ఇందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా మంగళవారం మత్స్య సంఘం పత్రాన్ని సర్పంచ్‌ పట్నం రాజుతో పాటు గ్రామస్తులకు అందించారు.

పెంకుటిల్లు కూలి ఇద్దరికి గాయాలు



చిన్నచింతకుంట: మండలంలోని మద్దూర్‌లో అకాల వర్షాలకు పెంకుటిల్లు కూలి ఇద్దరికి గాయాలైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బోయ రాములు పెంకుటిల్లు శిథిలావస్థకు చేరి పాక్షికంగా పైకప్పు ఊడిపడి ఉంది. రాములు, భార్య సుజాతలు ఇల్లు పడిపోవడంతో హైదరాబాద్‌కు కూలీ పనులకు వెళ్లి అక్కడే జీవనం సాగిస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌ నుంచి అదే గ్రామంలోని తన అల్లుడు శంకర్‌ ఇంటికి వచ్చారు. మంగళవారం సాయంత్రం శిథిలావస్థలో ఉన్న ఇంట్లో రాములుతో పాటు అల్లుడు శంకర్‌, భార్య సుజాత మంచం తీసుకురావడానికి వెళ్లారు. వర్షానికి తడిసి ఉన్న ఇంటి పైకప్పు పూర్తిగా కూలిపడింది. శంకర్‌, సుజాతలకు గాయాలయ్యాయి. గమనించిన గ్రామస్తులు వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పేదల సంక్షేమానికి కృషి

● జెడ్పీచైర్‌పర్సన్‌ స్వర్ణసుధాకర్‌రెడ్డి



ఓబ్లాయిపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ సుధాశ్రీ



కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్‌ స్వర్ణసుధాకర్‌రెడ్డి

చిన్నచింతకుంట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్‌ స్వర్ణ సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చిన్నచింతకుంట మండలం చిన్నవడ్డేమాన్‌లో ప్రభుత్వం చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌ పేదలకు ఉచిత వైద్యం అందించేలా కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే రాష్ట్రంలోని పేదలందరికీ ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెట్పీటీసీ రాజేశ్వరి, సర్పంచ్‌ ప్రభాకర్‌, కంటి వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్‌ రూరల్: కంటి వెలుగు శిబిరాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సుధాశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని ఓబ్లాయిపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ చంద్రకళ, నాయకులు వెంకటస్వామి, నర్సింగ్‌యాదవ్‌, లక్ష్మారెడ్డి, నాగన్న, వెంకటప్ప పాల్గొన్నారు.

దేవరకద్ర రూరల్: కౌకుంట్ల మండలంలోని రాజోళిలో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీటీసీ కిష్టన్న ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యురాలు సౌమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్‌ కార్మికులకు వేతనాలు పెంచాం



యూనిఫామ్స్‌ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

జడ్చర్ల: మున్సిపల్‌ కార్మికుల వేతనాలను పెంచామని ఎమ్మెల్యే డాక్టర్‌ సి.లక్ష్మారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్‌ కార్యాలయం వద్ద రూ.50లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోలను ఆయన ప్రారంభించారు. సకాలంలో చెత్తను తరలించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టేందుకు వాహనాలు ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్‌ కార్మికులకు యూనిఫామ్స్‌ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్‌ కార్మికులకు మే నెల నుంచి రూ.వెయ్యి వేతనాన్ని ప్రభుత్వం అదనంగా పెంచిందని తెలిపారు. వచ్చే నెల నుంచి పెరిగిన వేతనం అందుతుందన్నారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాన్ని కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్‌ కార్మికుల సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్‌ కృషి చేస్తున్నారని కొనియాడారు. వేతనాలను పెంచడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేసి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని సన్మానించారు. అనంతరం సరస్వతీనగర్‌ కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌ చైర్మన్‌ యాదయ్య, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ లక్ష్మి, కమిషనర్‌ షేక్‌, ఏడీఈ శ్రీనివాసులు, కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, నంద, చౌహాన్‌, సతీష్‌, మహేశ్‌, రాజు, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

నవాబుపేట: బీఆర్‌ఎస్‌ కార్యకర్తలకు వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రుద్రారంలో రెండు సంవత్సరాల కిందట మృతిచెందిన బీఆర్‌ఎస్‌ నాయకుడు యాదిరెడ్డి వర్ధంతిలో ఆయన పాల్గొని నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, సింగిల్‌ విండో చైర్మన్‌ నర్సింహులు, మార్కెట్‌ చైర్మన్‌ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య, వైస్‌ ఎంపీపీ సంతోష్‌, మాజీ సర్పంచ్‌ కృష్ణగౌడ్‌, రాజు, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

జడ్చర్ల: కావేరమ్మపేటలోని 2వ వార్డులో తాగునీటి సమస్య పరిష్కారం కోసం మంగళవారం బాలవికాస ఆధ్వర్యంలో బోరును వేయించారు. బోరు ఏర్పాటుతో కాలనీవాసులకు తాగునీటి సమస్య పరిష్కారమైందని కౌన్సిలర్లు మహేష్‌, శశికిరణ్‌ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్లు ప్రశాంత్‌, మార్తా డేవిడ్‌ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం



కోయిల్‌కొండ: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమని ఎంపీడీఓ జయరాములు అన్నారు. మంగళవారం మండలంలోని అనంతపూర్‌లో స్వచ్ఛ సర్వేక్షన్‌ గ్రామీణ్‌లో భాగంగా ఎంపీడీఓ జయరాములు, ఎంపీఓ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శుల బృందం గ్రామంలో శానిటేషన్‌ విధానాన్ని, సెగ్రిగేషన్‌ షెడ్డులో తడి, పొడి చెత్త సేకరణను పరిశీలించారు. గ్రామ పనితీరుపై ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



మహమ్మదాబాద్: పొలంలో విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద మేతమేస్తున్న గేదె ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మండలంలో నంచర్లలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నంచర్లకు చెందిన సంజనమోని మొగులయ్య పాడిగేదెను సాకుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం సాయంత్రం మేత మేపుతుండగా పొలంలో ఉన్న విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. రూ.80వేల విలువచేసే గేదె మృతిచెందడంతో రైతు బోరున విలపిస్తున్నాడు.

మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు



వస్తువులను పరిశీలిస్తున్న అధికారులు

మహమ్మదాబాద్: మండల కేంద్రంలో పలు దుకాణాలపై మంగళవారం తూనికలు కొలతల విభాగం అధికారులు దాడులు నిర్వహించారు. లీగల్‌ మెట్రాలజీ అధికారి రామ్మోహన్‌, టెక్నికల్‌ అధికారి ప్రవీణ్‌ ఆధ్వర్యంలో పలు హార్డ్‌వేర్‌ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. వస్తువులపై ఉన్న ధరలను పరిశీంచగా, కొందరు ఎమ్మార్పీ ధరల స్టిక్కర్లను సొంతంగా వేసుకుని వస్తువులను అమ్ముతున్నట్లు గుర్తించారు. అంతేకాకుండా వారు విక్రయించే సామగ్రి కోసం వాడే తూనికల యంత్రాలను పరిశీలించగా, తేడాలు వచ్చినట్లు తెలిపారు. వినియోగదారులను మోసాలకు గురిచేస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కంచన్‌పల్లి గేట్‌ పరిధిలో గల రెండు మార్వాడీ హార్డ్‌వేర్‌ దుకాణాలను పరిశీలించి వారిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని కొమిరెడ్డిపల్లిలో జరిగిన భూవివాదంలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయభాస్కర్‌ తెలిపారు. గ్రామ శివారులోని ఓ భూవివాదంలో సోమవారం సాయంత్రం ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. ఇందులో పటేల్‌ నర్సింహారెడ్డి ఫిర్యాదుతో దేవేందర్‌రెడ్డి మరి కొందరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇదే కేసులో అనిత ఫిర్యాదు మేరకు నర్సింహారెడ్డితో పాటు మరి కొందరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌



జడ్చర్లలో అంబేడ్కర్‌ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులు

జడ్చర్ల: జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులను నిర్ణీత ప్రొబేషనరీ గడువు ముగిసినా ఇప్పటి వరకు రెగ్యులరైజ్‌ చేయకపోవడం తగదని పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌ అన్నారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ మంగళవారం అంబేడ్కర్‌ విగ్రహానికి వినతిపత్రం అందజేసి వినూత్నంగా నిరసన తెలిపారు. రెగ్యులర్‌ చేయడంతో పాటు తమ నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలాన్నీ సర్వీసులో కలపాలన్నారు. అదేవిధంగా అవుట్‌ సోర్సింగ్‌ కార్యదర్శులను జేపీఎస్‌లుగా ప్రమోట్‌ చేస్తూ పనిచేసిన కాలాన్ని ప్రొబేషనరీ పీరియడ్‌లో పరిగణించడంతో పాటు రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి అఖిలాష్‌, శ్రీకాంత్‌రెడ్డి, శివప్రకాశ్‌, స్వాతి, సత్యమ్మ, శివకుమార్‌ పాల్గొన్నారు.

హన్వాడ: జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులు మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్‌ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు.

బాలానగర్: జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్‌ చేయాలని మగళవారం ఎంపీడీఓ కార్యాలయం నుంచి ముఖ్య కూడలి వరకు ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్‌ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు పలువురు జేపీఎస్‌లకు ఆర్థికసాయం అందజేశారు.

గండేడ్: గ్రామ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం రెగ్యులరైజ్‌ చేయాలని మండల కేంద్రంలోని అంబేడ్కర్‌ విగ్రహానికి వినతిపత్రం అందించారు. సర్పంచ్‌లు వెంకట్రాంరెడ్డి, జితేందర్‌రెడ్డి, పుల్లారెడ్డి తదితరులు కార్యదర్శులకు మద్దతు తెలిపారు.



మూసాపేటలో అంబేడ్కర్‌ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండల కేంద్రాల్లో జూనియర్‌ పంచాయతీ కార్యదర్శుల సమ్మె మంగళవారం కొనసాగింది. మూసాపేటలో కార్యదర్శులు అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అడ్డాకులలో వివిధ పార్టీల నాయకులు సమ్మెకు మద్దతు పలికారు. కార్యక్రమంలో కార్యదర్శులు సతీష్‌రెడ్డి, సురేష్‌, కృష్ణ, మహేందర్‌, నాగేందర్‌గౌడ్‌, మురళీధర్‌గౌడ్‌, అనిత తదితరులు పాల్గొన్నారు.



హన్వాడలో..

మిడ్జిల్: సమస్యలను పరిష్కరించాలని ఐదు రోజులుగా సమ్మె చేస్తున్న జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులు మంగళవారం మండల కేంద్రంలో ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్‌ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. వారికి ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఎంపీఓ అనురాధ, కార్యదర్శులు సాయన్న, శ్రీనివాస్‌, ప్రశాంత్‌, విజయలక్ష్మి, రాజశ్రీ మద్దతు తెలిపారు.

ప్రతిగింజను ప్రభుత్వమే కొంటుంది



వెంకట్‌రెడ్డిపల్లిలో వరిధాన్యం కొనుగోలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

మహమ్మదాబాద్: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ప్రతి గింజను వరిధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని వెంకట్‌రెడ్డిపల్లిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఎంతో శ్రమించి వరి ధాన్యాన్ని పండించారని, అకాల వర్షాల వల్ల ఎంతో నష్టపోయాని తెలిపారు. ఇలాంటి సమయంలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చి తడిసిన ధాన్యమైనా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గన్నీ బ్యాగుల విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, గండేడ్‌ తహసీల్దార్‌ జ్యోతి, వైస్‌ ఎంపీపీ ఈశ్వర్‌గౌడ్‌, నాయకులు, పెంట్యానాయక్‌, గోపాల్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, కొండారెడ్డి, కృష్ణ, బాలాజీ, సర్పంచ్‌ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

గండేడ్: వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పరిగి ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు వెన్నాచేడ్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, పెంట్యా, లక్ష్మీనారాయణ, రాంచంద్రారెడ్డి, కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.

మిడ్జిల్: మండలంలోని బైరంపల్లి, కంచన్‌పల్లి, వల్లబ్‌రావుపల్లి గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఎంపీపీ సుదర్శన్‌ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌, సర్పంచ్‌లు మల్లమ్మ, అఖ్తర్‌బేగం, నాయకులు కాడయ్య, శివప్రసాద్‌, జంగయ్య, రఫీక్‌ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి పౌరుడికి ఇవ్వాలి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్‌ రూరల్: భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి పౌరుడికి ఇవ్వాలని మంగళవారం సమీకృత కలెక్టరేట్‌ సముదాయంలో ఏఓ శంకర్‌కు ధర్మ సమాజ్‌ పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ధర్మసమాజ్‌ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ విశారదన్‌ మహారాజ్‌ పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాములు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని అధ్యయనం చేసిన ప్రతి పౌరుడు విలువలతో, క్రమశిక్షణతో భారత రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉంటారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, ఆనంద్‌, నాగన్న, ఉదయ్‌కిరణ్‌, రాములు, కుర్మయ్య, ఆంజనేయులు, రంగయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

దళితుల స్థలాలను ఆక్రమించడం తగదు



నిరసన తెలుపుతున్న బాధితులు

జడ్చర్ల: మండలంలోని నసరుల్లాబాద్‌లో దళితలకు ప్రభుత్వం కేటాయించిన స్థలాలతో పాటు తాము కొనుగోలు చేసిన స్థలాలను ఇతరులు ఆక్రమించడం తగదని బాధితులు మంగళవారం స్థానిక తహసీల్దార్‌ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. 1996లో తాము స్థలాలు కొనుగోలు చేసి పెంట కుప్పలకు వినియోగిస్తున్నామని, ఇటీవల మండల సర్వేయర్‌ తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇతరులకు సర్వే చేసి తమ స్థలాలతో పాటు ఇంటి స్థలాలను కూడా వచ్చేలా రిపోర్టు ఇచ్చారని ఆరోపించారు. తప్పుడు సర్వే రిపోర్టు ఆదారంగా తమ స్థలాలను ఇతరులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారనిచ సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు వారు డిప్యూటీ తహసీల్దార్‌ వెంకటేశ్వరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ చెన్నయ్య, బాలస్వామి, చంద్రయ్య, వెంకటయ్య, శాంతయ్య, జంగయ్య, విజయ్‌ తదితరులు పాల్గొన్నారు.

మండలంగా ప్రకటించాలని వంటావార్పు



రోడ్డుపై వంటావార్పుతో నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని మండల సాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం 101వ రోజు రోడ్డుపై పెద్దఎత్తున వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్‌ రామునాయక్‌, వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ 15గ్రామాల ప్రజలు మద్దతు తెలుపుతూ వంద రోజులుగా రిలేదీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. గద్వాల జిల్లాలో ఎర్రవల్లిని 9గ్రామాలతో కలిపి మండలం చేశారని, చిన్న, చిన్న గ్రామాలను రాష్ట్రంలో ఇటీవల మండలాలుగా ప్రకటించారని తెలిపారు. అతిపెద్ద మండలమైన కోయిల్‌కొండను రెండు మండలాలుగా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. గార్లపహాడ్‌ను మండలంగా ఏర్పాటు చేయడం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి ఇష్టం లేదా అని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం ఇదే వైఖరి కొనసాగిస్తే రానున్న రోజుల్లో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రోడ్డుపై వంటావార్పు చేయడం ద్వారా రోడ్డుపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పోలీసులు జోక్యం చేసుకొని రోడ్డుపై ఖాళీ చేయించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్‌ రామకృష్ణారెడ్డి, రవి, ఆంజనేయులు, రాజు, వెంకటేష్‌, యాదిరెడ్డి, కృష్ణయ్య, రవీందర్‌, నర్సిములు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

వైభవంగా శివాలయ వారోత్సవాలు



గణపతి హోమం నిర్వహిస్తున్న భక్తులు

బాలానగర్: మండలంలోని చిన్నరేవల్లిలో శివాలయ వారోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వారోత్సవాల్లో భాగంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు మంగళవారం భజనలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. గణపతి హోమంలో జంటలు పాల్గొని హోమం నిర్వహించారు. సర్పంచ్‌ లక్ష్మి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

శాకాహార ర్యాలీని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న చెన్నకేశవులు

స్టేషన్‌ మహబూబ్‌నగర్: ఈ నెల 7 వ తేదీన శాకాహార ర్యాలీ నిర్వహిస్తునట్లు పిరమిడ్‌ స్పిరిచ్యువల్‌ సొసైటీ మూవ్‌మెంట్‌ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పిరమిడ్‌ కేంద్రంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబ్‌నగర్‌లో నిర్వహించే ర్యాలీకి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పిరమిడ్‌ మాస్టర్లు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ర్యాలీకి సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. ఏర్పాట్లపై మాస్టర్లతో చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ శాకాహారం తీసుకోవడం ద్వారా అనేక లాభాలు ఉన్నాయని తెలిపారు. ఈ విషయమై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్పిరిచ్యువల్‌ సొసైటీ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, ప్రవీణ్‌, సూర్యప్రకాశ్‌, కిరణ్‌, నరెందర్‌, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం: కేసు నమోదు

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లికి చెందిన యువతి కనిపించడం లేదని తండ్రి ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ విజయభాస్కర్‌ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సిద్ధయ్య, భాగ్యమ్మ దంపతులు గత నెల 29న మహబూబ్‌నగర్‌ వెళ్లారు. వారి కుమార్తె బోలశోభ(19) ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు అంతటా వెతికారు. బంధువులను విచారించినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం మూసాపేట పోలీస్‌స్టేషన్‌లో యువతి తండ్రి సిద్ధయ్య ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు యువతి ఆచూకీ కోసం వెతుకుతున్నట్లు ఎస్‌ విజయభాస్కర్‌ తెలిపారు.